సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



బాధిత కుటుంబాలకు అండగా మాజీ సీఎం జగన్

డయేరియా కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. - 8లో



కూటమి నాయకుల్లో నిరాశ

తోటపల్లి ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవి వీరఘట్టం మండలానికి కేటాయించగా, వైస్ చైర్మన్ పదవి ఆశించిన పాలకొండ వాసులకు నిరాశే మిగిలింది. - 8లో

డీఎంహెచ్‌ఓగా భాస్కరరావు



పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓగా డాక్టర్ భాస్కరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఇప్పటి వరకు విజయనగరం జిల్లా డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం పార్వతీపురం ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వహించిన విజయపార్వతి ఐటీడీఏ సీతంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా వెళ్లనున్నారు. భాస్కరరావుకు గతంలో పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేసిన అనుభవం ఉంది.

న్యూస్‌రీల్

రక్తహీనత నివారణే లక్ష్యం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం: గర్భిణులు, విద్యార్థుల్లో రక్తహీనతను నివారించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి రక్తహీనత నివారణపై వైద్యాధికారులు, సీడీపీఓలు, వసతిగృహ సంక్షేమాధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ 11 శాతానికి తక్కువ కాకుండా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు, గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి ఎనీమియా సమస్య లేకుండా చూడాలన్నారు. తోణాం, దుడ్డుఖల్లు పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య ఎక్కువగా ఉందని, వారం రోజులు బస చేసి సమస్యను అధిగమించేలా చూడాలని ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణికి ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో స్కూల్ హెల్త్ రికార్డు నిర్వహించాలన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.వినోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు టి.జగన్మోహన్‌రావు, పద్మావతి, డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి బి.వాగ్దేవి, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి పీఎల్ రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని బలోపేతం చేస్తాం

- రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



పార్వతీపురం డిపోలో నూతన బస్సులు ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీను మరింత బలోపేతం చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పార్వతీపురం బస్టాండ్ ఆవరణలో నూతన బస్సులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీకాంప్లెక్స్‌కు సదుపాయాల కల్పనతో పాటు జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆర్టీఓ, ఎంవీఐఓలకు కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. అనంతరం ఎస్‌వీడీ కళాశాలలో క్రీడీ మైదానం, నర్సిపురం గ్రామంలో డ్రైవింగ్ ట్రాక్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర, ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆకాశపు విజయకుమార్, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటినాయుడు, విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, పార్వతీపురం డిపో మేనేజర్ ఈఎస్‌కె. దుర్గ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీసీఎం పుష్పశ్రీవాణి దంపతులు

జననేతపై అభిమాన జల్లు



పార్వతీపురంలో నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు

జననేత, వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం పండగలా నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ, అభివృద్ధి పాలనను గుర్తుచేశారు. జగనన్నను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపు నిచ్చారు.

-సాక్షి, పార్వతీపురం మన్యం



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు తదితరులు



సాలూరులో జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న మాజీ డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర, పాల్గొన్న పార్టీ శ్రేణులు

విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ అవసరం



కేసలి అప్పారావు

సాక్షి, పార్వతీపురం మన్యం: విద్యార్థులపై వసతిగృహ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ గ్రామంలో విద్యార్థిని నిర్బంధించి కొట్టినట్లు వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. జరిగిన ఘటనపై వివరణ కోరినట్లు తెలిపారు. తెలిసీతెలియని వయసులో బాలల వల్ల ఏదైనా తప్పిదం జరిగితే.. వారిని అదుపులోకి తీసుకుని శిక్షించడం సరికాదని పేర్కొన్నారు. అలా ఎవరైనా బాలలను శిక్షించినట్లయితే వారిపై బాలల న్యాయ చట్టం ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల వార్డెన్లు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

గిరిజన విద్యార్థుల ఆందోళన



అడవితల్లి విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మల్లి పీవీటీజీ గురుకులం విద్యార్థులు

సీతంపేట: గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించి పాఠశాలకు పంపించాలంటూ మల్లి పీవీటీజీ గురుకుల పాఠశాలకు చెందిన 9,10 వ తరగతి విద్యార్థులు సీతంపేట ఐటీడీఏ వద్ద శనివారం ఆందోళన చేశారు. అడవితల్లి విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఉపాధ్యాయులు ధర్నాలో ఉండిపోవడంతో పరీక్షలు సమీపిస్తున్నా సిలబస్ పూర్తికాలేదన్నారు. టీచర్లను పంపిస్తేనే స్కూల్‌కు వెళ్లామని, లేదంటే ఇళ్లకు వెళ్లిపోతామని స్పష్టంచేశారు. ఐటీడీఏ పీఓ అందుబాటులో లేకపోవడంతో పీఎంఆర్‌సీ ఏఎంఓ పి.కోటిబాబు, గిరిజన సంక్షేమ కార్యాలయ సూపరెంటెండెంట్ దేశ్‌లు విద్యార్థులకు నచ్చజెప్పారు. త్వరలోనే ఉపాధ్యాయుల సమస్య పరిష్కారమవుతుందని చెప్పడంతో ఆందోళన విరమించారు. గిరిజన జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు.

పంటలను నాశనం చేస్తున్న గజరాజులు



ఏనుగులు నాశనం చేసిన వరి పంటను చూపిస్తున్న రైతు

గరుగుబిల్లి: మండలంలోని సుంకి గ్రామంలో వరిచేను కుప్పలను ఏనుగులు నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఓ వైపు వర్షాలు, మరోవైపు ఏనుగులు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని, కష్టాన్ని క్షణాల్లో నాశనం చేస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం రాత్రి పెనుగంటి గౌరునాయుడు, మరికొందరు రైతులకు చెందిన రెండు ఎకరాల్లోని వరిచేను కుప్పలను చెల్లాచెదురుగా విసిరేశాయి. ప్రభుత్వం స్పందించి ఏనుగులను తరలించాలని కోరుతున్నారు.

పొలాల్లో నీరు.. రైతుకంట కన్నీరు



భామిని మండలం నేరడిలో ధాన్యం రాశులు ఇలా..



మెంటాడ మండలం జక్కువలో నీటమునిగిన వరి కుప్పలను చూపిస్తున్న రైతులు

- అన్నదాతలకు వాయు'గండం'
- చి'వరి'లో కష్టం
- పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు

సాక్షి, పార్వతీపురం మన్యం: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు.. శనివారం కాస్త తెరిపి ఇచ్చినట్లయ్యింది. అక్కడక్కడ చిన్న జల్లులు మినహా.. వర్ష ప్రభావం కనిపించలేదు. ఇదే సమయంలో గురువారం సాయంత్రం నుంచి కురిసిన వర్షంతో వరి పంట చేలలో నీరు చేరింది. కొంతమంది రైతులు కోతలు పూర్తి చేసిన ధాన్యాన్ని పొలాల్లోనే కుప్పలు వేయగా.. నూర్చిన ధాన్యాన్ని తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో ఈ ఏడాది 1,75,474 ఎకరాల్లో వరి సాగవ్వగా.. ఇప్పటికే 1.70 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. 85 వేల ఎకరాలకుపైగా నూర్పులు పూర్తయ్యాయి. రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ ద్వారా 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు అధికారులు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశారు. మిగిలిన పంట రైతుల వద్దనే ఇంకా ఉంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, సీతానగరం, బలిజిపేట, పాలకొండ, భామిని, సాలూరు పరిసర ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో ఇంకా నూర్పులు పూర్తికాలేదు. కళ్లాల్లో కుప్పలు వేసి, వరి దిబ్బలపైన.. నూర్చిన ధాన్యం బస్తాలపైన టార్పాలిన్లు వేసి రైతులు కాపాడుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ధాన్యం బస్తాలను కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధమవుతున్న సమయంలో వర్షం కురవడంతో ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. ధాన్యం రంగు మారితే, తేమ శాతం సాకుగా చూపి మద్దతు ధరకు కోత వేస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా మిల్లర్లు ధాన్యం దోపిడీకి తెర తీశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అపరాలకూ తప్పని నష్టం..

అపరాలు, పత్తి పంటకు కూడా వర్షం వల్ల నష్టం ఏర్పడుతోంది. పత్తి తడిచి ముద్దవుతోంది. రబీలో దాదాపు 63,780 ఎకరాల్లో వివిధ రకాల వాణిజ్య పంటలు వేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మినప, పెసర వంటి పంటలు కొన్నిచోట్ల పూత దశకు చేరుకుంది. మరికొన్ని గ్రామాల్లో మొక్క స్థితిలో ఉంది. పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- వర్షాల కారణంగా పార్వతీపురం మండలంలో 1,180 ఎకరాలు, సీతానగరం మండలం 1080, బలిజిపేట మండలంలో 1,200 ఎకరాల వరకు అపరాల సాగుకు నష్టం చేకూరినట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో కుప్పలు వేసిన వరి మాత్రం పార్వతీపురం మండలంలో 168 ఎకరాలు, సీతానగరం మండలం 170, బలిజిపేట మండలం 150 ఎకరాల మేర తడచి నష్టం చేకూరిందని రైతులు చెబుతున్నారు.
- సాలూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు గోనె సంచులు, వాహనాలు అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొత్తవలస ప్రాంతంలో రైతులు తమ వరిచేలు కోయలేదు. వాతావరణం అనుకూలిస్తే కోసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. కోతకు కాలం పూర్తిగా దాటిపోవడంతో ధాన్యం రాలిపోయే పరిస్థితి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. మెంటాడ మండలంలో వర్ష ప్రభావంతో ఎక్కడా ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. జక్కువ గ్రామంలో పొలంలో వేసిన వరి దిబ్బలు నీట మునిగాయి.

మూడు రోజుల్లో మండలాలవారీగా నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి.	
మండలం	కురిసిన వర్షం (మి.మీ.)
పాలకొండ	81.0
వీరఘట్టం	54.2
జియ్యమ్మవలస	66.4
కురుపాం	59.4
గుమ్మలక్ష్మీపురం	62.2
సీతంపేట	38.2
భామిని	42.2
పార్వతీపురం	65.6
కొమరాడ	49.4
బలిజిపేట	74.0
గరుగుబిల్లి	67.8
సీతానగరం	84.8
సాలూరు	83.8
మక్కువ	83.2
పాచిపెంట	74.8

- పాలకొండ నియోజకవర్గంలో రైతన్న కంట కన్నీరే మిగిలింది. ఖరీఫ్ సేద్యానికి సంబంధించి చివరిదశలో వరుస తుపాన్ల కారణంగా చేతికందిన పంట తడిచిముద్దవుతోంది. వీరఘట్టం మండలంలో 15వేల ఎకరాలకు పైగా వరిసాగు చేయగా 9వేల ఎకరాల వరకు రైతులు ఇప్పటికే విక్రయించేశారు. మిగిలిన పంట కళ్లాల్లోనే ఉంది. వర్షానికి తడిచిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. 350 ఎకరాల్లో కూరగాయల పంట, 4వేల ఎకరాల వరకు అపరాల పంటలకు నష్టం వాటిల్లింది. భామిని మండలంలో ఐదు వేల ఎకరాల మేర పంటను కాపాడుకునేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. అపరాలు, సన్‌ఫ్లవర్ పంటలు నీటిముంపులో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పాలకొండ మండలంలో దాదాపు 5వేల ఎకరాలకుపైగా ధాన్యం కొనుగోళ్లు జరగాల్సి ఉంది. 2వేల ఎకరాల వరకు లోతట్టు ప్రాంతాల్లో అపరాల పంటకు నష్టం తప్పేటట్లు లేదని రైతులు వాపోతున్నారు.

వర్షపాతం వివరాలు

ఈ నెల 19, 20, 21వ తేదీల్లో జిల్లాలో 65.8 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. 19న 1.3 మి.మీ, 20న 17.1 మి.మీ., 21న 47.4 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

సర్కారు సాయం అవసరం



వరుస తుపాన్లతో వరి, అపరాల రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. తడిసిన ధాన్యం రక్షించుకొనేందుకు ఆపసోపాలు పడ్డాం. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. సర్కారు చొరవ చూపాలి. నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి. అపరాల పంటలకు నష్టపరిహారం అందించాలి. - గౌరుసెట్టి సుగ్రీవులు, గురండి, భామిని మండలం

చంద్రబాబు పాలనలోనే... గిరిజన ప్రాంతాలకు గ్రహణం

- ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువకాలం టీడీపీదే ఏలుబడి... సీఎంగా ఉన్నది చంద్రబాబే
- ఏ ఒక్క గిరిశిఖర గ్రామానికైనా రోడ్డువేశారేమో ఆయన్ను ప్రశ్నించండి
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర హితోపదేశం
- గిరిశిఖర గ్రామాలకు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే రోడ్లు
- పవన్ నడిచిన మట్టిరోడ్డూ వేసింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే..



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యధిక కాలం పాలించినది తెలుగుదేశం పార్టీయేనని, అందులోనూ నాలుగు దఫాలుగా సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిందీ చంద్రబాబు మాత్రమేనని, అంత అనుభవకాలంలో ఏ ఒక్క గిరిశిఖర గ్రామానికైనా రోడ్డు వేశారా? అని ఆయనను ప్రశ్నించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పీడిక రాజన్నదొర హితవు పలికారు. సాలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులే ఎక్కువ కాలం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, ప్రస్తుత ఎమ్మెల్యే రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా ఎమ్మెల్సీగా ఆరేళ్లపాటు పదవిని అనుభవించారని, మరి వారు ఏ ప్రాంతానికి రోడ్డు వేయించారో ఒక్కసారి అడిగితే పవన్‌కు తెలిసేదని అన్నారు. సాలూరు నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై రాజన్నదొర తీవ్రంగా స్పందించారు. శనివారం సాలూరులోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆయన మాటల్లోనే...

- ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతానికి రావడాన్ని ఒక గిరిజన నాయకుడిగా తాను స్వాగతిస్తాను. కానీ గతమేమిటో, గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో తెలుసుకోకుండా రాజకీయాల కోసం ఏవేవో మాట్లాడితే మాత్రం కచ్చితంగా ఖండిస్తాను.
- సాలూరు నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతంలో కొటియా గ్రామాలకు మొట్టమొదట బీటీ రోడ్డును తాను ఎమ్మెల్యేగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి నిర్మాణం చేయించాను. తర్వాత మళ్లీ ఆయన కుమారుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 11 బీటీ రోడ్లు, ఎనిమిది భారీ వంతెనలను మంజూరుచేయించాను. వాటిలో చాలావరకూ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. తద్వారా గిరిజన గ్రామాలకు మైదాన ప్రాంతంతో అనుసంధానం ఏర్పడింది. గిరిజనులకు ప్రయాణ, వైద్య సౌకర్యం ఎంతో మెరుగుపడింది.
- గిరిజన ప్రాంతాలకు గత పాలకులు రోడ్డు వేయలేదని మొసలికన్నీరు కార్చడం సరికాదు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒక్క రోడ్డు అయినా నిర్మించారా అని ప్రశ్నించాలి.
- సాలూరు మండలంలోని సిరివర గ్రామానికి చెందిన ఓ గిరిజన గర్భిణి ప్రసవ వేదనపై జాతీయ మానవహక్కుల కమిషన్ సుమోటాగా స్పందించి నోటీసులు పంపించినప్పుడు అధికారంలో ఉన్నది కూడా టీడీపీయే. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నది కూడా చంద్రబాబు. నాడు హడావిడిగా రూ.8 కోట్లతో రోడ్డు మంజూరుచేస్తున్నట్లు టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తీరా 2019లో దిగిపోయేనాటికి కూడా నిధులు మంజూరుచేయకుండా గిరిజనులను మోసం చేశారు. అలా ఎందుకు చేశావని చంద్రబాబునే పవన్ కళ్యాణ్ ప్రశ్నించాలి.
- సాలూరు నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నడిచివెళ్లిన బాగుజోల గ్రామానికి మట్టి రోడ్డు వేయించిందీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. సిరివర రోడ్డుకు, కొదమకు అటవీ ప్రాంతంలో కొండలు, గుట్టలు తొలిచి మట్టి రోడ్డు వేయించాం. చిలకమెండంగి రోడ్డుకు కూడా కేంద్రానికి పోలీసు అధికారుల ద్వారా నివేదికలు పంపించి పీఎంజీఎస్‌వై నిధుల కోసం ప్రయత్నాలు చేశాను. ఆ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

అభిమానుల మాటకు విలువేది?

పర్యటనలో జనసైనికులేమో పవన్ కళ్యాణ్‌ను సీఎం సీఎం అంటూ నినాదాలు చేస్తున్నారని, ఆయనేమో చంద్రబాబు మరో రెండు పర్యాయాలు సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారని రాజన్నదొర ఎద్దేవా చేశారు. చంద్రబాబే సీఎంగా ఉండాలంటూ పదేపదే చెబుతున్న పవన్ కళ్యాణ్... తన అభిమానుల మాట మన్నించి ఎప్పుడు సీఎం అవుతారని ప్రశ్నించారు.

గిరిజనులను అడిగితే చెప్పేవారు...

గిరిజన ప్రాంతాలకు గత పాలకులు ఎవ్వరూ రాలేదని, తానే కాలినడకన వచ్చానని పవన్ కళ్యాణ్ మాట్లాడటాన్ని రాజన్నదొర తప్పుబట్టారు. చిలకమెండంగి, బాగుజోల తదితర గిరిశిఖర, గిరిజన గ్రామాలకు తాను కాలినడకన వెళ్లి అక్కడి గిరిజనులతో మాట్లాడి ఎన్నో సమస్యలు పరిష్కరించానని గుర్తు చేశారు. గత ఎమ్మెల్యే, మాజీ మంత్రి రాజన్నదొర ఇక్కడకు ఎప్పుడైనా వచ్చారా అని గిరిజనులను పవన్ కళ్యాణ్ అడిగి ఉంటే వారు వాస్తవమేమిటో చెప్పేవారన్నారు. అలాగాకుండా ఇక్కడకు గత పాలకులెవరైనా వచ్చారా? అంటే... లేదు లేదు అని చెప్పండంటూ మంత్రి సంధ్యారాణి సిగ్గులేకుండా గిరిజనులకు సైగ చేసి చేతులు ఊపించారని చెప్పారు. ఆమె ఎన్నిసార్లు వెళ్లారో పవన్ కళ్యాణ్ అడిగి ఉండాల్సిందన్నారు. సంధ్యారాణి ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో గిరిశిఖర గ్రామాలకు ఒక్క రోడ్డు అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నిస్తే బాగుండేదన్నారు. కనీసం ఇప్పుడైనా గిరిజనులకు ఇచ్చిన హామీలన్నీ ఆచరణలోకి తేవాలని కోరారు.

పొలానికి వెళ్లి.. విగతజీవులుగా మారి..

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు అన్నదమ్ములు మృతి
- శిఖబడి గ్రామంలో విషాదం
- గతంలో వారి అన్నయ్య కూడా పొలంలోనే తనువుచాలించిన వైనం



విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన అన్నదమ్ములు శ్రీను, సింహాచలం

జియ్యమ్మవలస: వారిది ఉమ్మడి కుటుంబం. వ్యవసాయమే జీవనాధారం. ఇంటిల్లిపాదీ ఆరుగాలం పొలంలో శ్రమిస్తూ కుటుంబాలను నెట్టుకువస్తున్నారు. ఇప్పుడు ఆ పొలంలోనే ఒక్కొక్కరుగా తనువుచాలిస్తుండడం కలవరపరుస్తోంది. ఐదేళ్ల కిందట పెద్దన్నయ్య కృష్ణ పొలంలోనే మృతి చెందగా.. ఇప్పుడు పొలానికి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వైకుంఠపు శ్రీను (45), సింహాచలం(43) ఎస్టీ మరువాడ వద్ద ఉన్న పొలంలో రబీ వరి పంట కోసం నారుమడి సిద్ధం చేసేందుకు శనివారం ఉదయం వెళ్లారు. ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యు లు ఫోన్‌చేశారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా ఇద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. మోటారు వేసే సమయంలో సపోర్టు వైరుకు విద్యుత్ ప్రసరించడం, దానికి వారు తగలడంతో షాక్‌కు గురై మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. మృతుడు శ్రీను ఇద్దరు కుమారుల్లో చక్రధర్ ఎంసీఏ చేస్తుండగా వెంకటేష్ ఐటీఐ చదివి ప్రైవేటు ఉద్యోగంలో ఇటీవల చేరాడు. సింహాచలం పాప రమ్య డిగ్రీ చదువుతుండగా రమేష్ ఐటీఐ చదువుతున్నాడు. ఐదేళ్ల కిందట మృతిచెందిన కృష్ణకు ఇద్దరు అమ్మాయిలు ఉండగా వారికి పెళ్లిళ్లు జరిగాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. మృతుల తండ్రి మరణించగా తల్లి మహాలక్ష్మి ఉంది. ఇంటికి పెద్ద దిక్కును మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల భార్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసన్నకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

ఆంధ్ర మహిళా క్రికెట్ అండర్-19 జట్టుకు హారిక ఎంపిక


రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన కోరుకొండ హారిక

విజయనగరం అర్బన్: ఆంధ్ర రాష్ట్ర మహిళా క్రికెట్ అండర్ - 19 జట్టుకు పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి గణపతి డిగ్రీ కళాశాల బీకాం రెండో సంవత్సర విద్యార్థిని కోరుకొండ హారిక ఎంపికైంది. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చాయని కళాశాల కరెస్పాండెంట్ వై.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 4న కేరళలో జరిగే వన్‌డే క్రికెట్ పోటీలలో పాల్గొనే ఆంధ్ర మహిళా క్రికెట్ అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హారికను కళాశాల యాజమాన్యం, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

గంజాయి వ్యాపారుల నుంచి ఆస్తులు కొనుగోలు చేయొద్దు

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి



విజయనగరం క్రైమ్: గంజాయి వ్యాపారం ద్వారా ఆస్తులు కూడబెట్టిన వ్యక్తుల నుంచి ఎవరూ ఆస్తులు కొనుగోలు చేయవద్దని ప్రజలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అక్రమ వ్యాపారాలతో కూడబెట్టిన ఆస్తులను, వారి నుంచి తిరిగి ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరమైన చిక్కులు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, అమ్మకాలు నిర్వహించి, ఆస్తులు కూడబెడితే వాటిని సీజ్ లేదా జప్తు చేసేందుకు పోలీసు శాఖ చర్యలు చేపడుతుందన్నారు. రేంజ్ పరిధిలో ఇటువంటి అక్రమ వ్యాపారాలకు పాల్పడిన వ్యక్తులను ఇప్పటికే గుర్తించామని, వారి ఆస్తులను సీజ్ చేసేందుకు చట్టపరమైన చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఏమైనా నూతనంగా ఆస్తులు కొనుగోలు చేసే ముందు సదరు విక్రయదారులు ఆయా ఆస్తులు ఏ విధంగా సంక్రమించాయి, వాటి చట్టపరమైన స్థితిని ముందుగా ధ్రువీకరించుకోవాలన్నారు. లేకుంటే కొనుగోలుదారులు చట్టపరమైన, ఆర్థికపరమైన సమస్యల్లో చిక్కుకుపోతారన్నారు. అటువంటి ఆస్తులతో కూడిన లావాదేవీలతో కొనుగోలుదారులకు చట్టపరమైన తీవ్ర పరిణామాలు తప్పవని సూచించారు. ఇదేరకంగా అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలానికి చెందిన పడాల నాగేశ్వరరావు అనే వ్యక్తి దశాబ్ద కాలంగా గంజాయి వ్యాపారం సాగించి, తన పేరున, భార్య పేరున 15.36 ఎకరాల భూములు కొనుగోలు చేశారని, సదరు భూమి విలువ రూ.62.80 లక్షలు ఉంటుందని విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఆదాయం అక్రమ సంపాదనగానే గుర్తించడం జరుగుతుందన్నారు.

ఉచిత న్యాయ సహాయం పొందండి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టీవీ రాజేష్ కుమార్

విజయనగరం క్రైమ్: రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు ఎవరూ న్యాయవాది లేకుండా ఉండకూడదని, అలాంటి వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదిని ఉచితంగా అందిస్తుందని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టివి.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి ఆదేశాలతో శనివారం విజయనగరం సబ్‌జైల్‌ను సందర్శించారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి, వారికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. 70 ఏళ్లు పైబడిన వృద్ధులు, అస్వస్థతతో ఉన్నటువంటి ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్, ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయసహాయమందించేందుకు జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని సూచించారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయమందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమన్నారు. జైల్లో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని, భోజనశాలను, స్టోర్ రూమ్ తదితర వాటిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ బి.సంపత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

బాధిత కుటుంబాలకు అండగా మాజీ సీఎం జగన్

- నాగళ్లవలసలో రెండు కుటుంబాలకు పరిహారం
- రూ.2 లక్షల చొప్పున చెక్‌లు అందజేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


నాగళ్లవలసకు చెందిన బూరి నీలమ్మకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


బూరి శాంతకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: డయేరియా కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, మాట ఇవ్వడమే కాకుండా అమలు చేసి చూపించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గుర్ల మండలంలోని నాగళ్లవలసలో డయేరియా కారణంగా మృతి చెందిన రెండు కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ.2 లక్షల చెక్కులను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్ల మండలంలో డయేరియా విజృంభించడంతో 13 మంది మృతి చెందడంతో కుటుంబాలు అనాథలుగా మిగిలాయన్నారు. అదే సమయంలో ఆ కుటుంబాలను ఓదార్చేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం అందజేస్తామని మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారం ఇప్పటికే 11 కుటుంబాలకు పరిహారం చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. తాజాగా నాగళ్లవలసకు చెందిన బూరి శాంతి, బూరి నీలమ్మలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను అందజేసినట్లు చెప్పారు. గుర్ల డయేరియా బాధిత కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని స్పష్టం చేసారు. కానీ ప్రభుత్వం కనీసం బాధిత కుటుంబాలను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుర్ల మండల నాయకులు కెవి. సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాశినాయుడు, శీర అప్పలనాయుడు, స్వామినాయుడు, తోట తిరుపతి, బెల్లాన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైనిక స్కూల్‌లో విద్యనభ్యసించడం పూర్వజన్మ సుకృతం

- ప్రిన్సిపాల్ ఎస్ఎస్.శాస్త్రి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యనభ్యసించడం పూర్వజన్మ సుకృతమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. పాఠశాలలోని పివిజి.రాజు ఆడిటోరియంలో శనివారం జరిగిన వార్షికోత్సవ ముగింపుతో పాటు పేరేంట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కోరుకొండ సైనిక పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల ప్రయాణంలో మరో మైలురాయిని సూచిస్తున్నాయన్నారు. ఇక్కడ విద్యతో పాటు వ్యక్తిగత జీవనశైలి, క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకితభావం, కుటుంబ విలువల వంటి ఎన్నో లక్షణాలను నేర్చుకోవడం తద్వారా వాటిని అమలు చేయడంలో పలువురికి ఆదర్శవంతులవ్వడం జరుగుతుందన్నారు. ముందు తరం విద్యార్థులు ఎంతో మందికి నేడు ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో ఉండి పాఠశాలకు, తద్వారా దేశానికి ఎంతో కీర్తిని తీసుకువచ్చారన్నారు. అనంతరం పాఠశాల విజయాలు, విద్యావేత్తలు, క్రీడలు, పాఠ్యాంశాలలో క్యాడెట్ల అద్భుతమైన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా ప్రతిభను, సృజనాత్మకతను చాటిచెప్పే సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

24న జిల్లా స్థాయి బాలుర కబడ్డీ పోటీలు

విజయనగరం: కబడ్డీ, ఖోఖో క్రీడల పితామహుడు దివంగత వై.భగవాన్‌దాస్ మాస్టారు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 24న జిల్లా స్థాయి ఉన్నత పాఠశాలల బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు భగవాన్‌దాస్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయనగరం జిల్లా కేంద్రంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలుర క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 94906 63367, 94947 77753 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రతీ పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్‌ను ప్రవేశపెట్టాలి

బొబ్బిలి రూరల్: పాఠశాలలోని విద్యార్థులకు మానసిక పటుత్వంతో పాటు వికాసం, శారీరక ధైర్యం, దేశభక్తిని తెలియజేయాలంటే ప్రతీ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పాటు ఎన్‌సీసీని ప్రవేశపెట్టాలని డెల్టా సంఘ అధ్యక్షుడు మింది విజయమోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని అలజంగి ఎంపీపీ పాఠశాలలో ఆ సంఘ సభ్యులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో ప్రాథమిక హక్కులు, సామాజిక బాధ్యత, స్వీయ రక్షణ తదితర అంశాల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయుడి వాహనం ఢీకొని..

- నలుగురికి తీవ్ర గాయాలు
- కొరసవాడ యాతపేట వద్ద ఆటోను ఢీకొన్న స్కార్పియో
- ఇద్దరి పరిస్థితి విషమం


నుజ్జయిన ఆటో


తోటలోకి దూసుకుపోయిన స్కార్పియో


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ యాతపేట సమీపంలో జాతీయ రహదారిపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయి గణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం శివశంకర్ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు సింగ ఆనంద్ శనివారం మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన చెప్పల బోగయ్య, సంతు, సవలాపురం నరేష్, గణేష్‌లు కలిసి ఆటో డ్రైవర్ కూర్మాన సునీల్‌తో కలిసి వచ్చారు. పరామర్శ అనంతరం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కొరసవాడ యాతపేట సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు మామిడి సాయి గణేష్ ప్రయాణిస్తున్న స్కార్పియో ఢీ కొట్టింది. ఆటో బోల్తాపడగా.. స్కార్పియో పక్కనే ఉన్న టేకు తోటలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నలుగురితో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే తనయుడు సాయిగణేష్, డ్రైవర్ రాజేష్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో పాతపట్నం సీహెచ్‌సీకు తరలించారు. వైద్యులు మన్మథరావు, విక్రమ్, దేవి ప్రసాద్‌లు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకోసం అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. చెప్పల బోగయ్యకు, చెప్పల సంతుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామారావు తెలిపారు.

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అదనపు జడ్జి



రిమాండ్ ఖైదీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తులు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య స్థితిగతులపై సబ్ జైల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అదనపు జడ్జి సీహెచ్ వివేకానంద శ్రీనివాస్ కోరారు. పాలకొండ సబ్ జైల్‌లో స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజుకుమార్‌తో కలసి శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న న్యాయ సేవలపై ఆరా తీశారు. వారు చేసిన నేరం, బెయిల్ విషయంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు పరిసరాలు, పారిశుద్ధ్య నిర్వహణ, భోజనం, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట శ్రీకాకుళం సబ్ జడ్జి ఆర్.సన్యాసిరావు, న్యాయవాదులు బి.రామ్మోహనరావు, ఆర్.కుమారస్వామి, ఎస్.సింహాచలం, జైల్ ఇన్‌చార్జి పి.చంద్రరావు, వార్డర్లు బి.విజయకుమార్, హేమసుందర్, ఏఎస్సై శ్రీనివాస్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పాలకొండ కూటమి నాయకుల్లో నిరాశ

- తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్‌గా విజయరమణి


తోటపల్లి ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు నియామకపత్రాలు అందజేస్తున్న పీడీ రామచంద్రరావు

వీరఘట్టం: తోటపల్లి ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవి వీరఘట్టం మండలానికి కేటాయించగా, వైస్ చైర్మన్ పదవి పాలకొండ మండలానికి వస్తుందని ఆశించిన వారందరికీ నిరాశే మిగిలింది. శనివారం వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో కంబర నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు, వీరఘట్టం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ అయినటువంటి పొదిలాపు విజయరమణిని అంతా ఏకగ్రీవంగా ఎప్పుకున్నారు. వైస్ చైర్మన్ ఎన్నికకు కొంత సమయం కేటాయించడంతో తీవ్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజులగుమ్మడ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడికి తోటపల్లి ప్రాజెక్టు వైస్ చైర్మన్ ఇవ్వాలని వంగర మండలానికి చెందిన సుమారు 50 మంది కూటమి నాయకులు, కార్యకర్తలు పట్టుబట్టారు. దీంతో తోటపల్లి ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు అదుపు తప్పే పరిస్థితి రావడంతో తప్పనిసరి పరిసితుల్లో రాజులగుమ్మడకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఆటుబిల్లి పార్థసారధికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చేందుకు అంతా సమ్మతించారు. వైస్ చైర్మన్ రేసులో ఉన్న పాలకొండ మండలానికి చెందిన తూడి, ఎం,సింగుపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులకు కూటమి నాయకులు బుజ్జగించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వచ్చిన డ్వామా పీడీ రామచంద్రరావు చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎంపికైన వారికి ధ్రువపత్రాలను అందజేసారు. సీతంపేట ఐటీడీఏ ఏపీఓ చిన్నారావు అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై తీసుకున్న చర్యలేమిటి?

- జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు
- సమగ్ర నివేదిక కోరిన కమిషన్


నోటీసును చూపిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్

సాక్షి, పార్వతీపురం మన్యం: ఉత్తరాంధ్ర ప్రాంతంలో గిరిజన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల మరణాలు.. నివారణకు తీసుకున్న చర్యలు.. తల్లిదండ్రులకు ఇస్తున్న పరిహారంపై పూర్తిస్థాయిలో వాస్తవ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు పంపింది. నెల రోజుల్లోగా సమాధానం ఇవ్వకుంటే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఏ ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి, పార్వతీపురానికి చెందిన పాలక రంజిత్‌కుమార్ ఫిర్యాదుపై ఈ మేరకు కమిషన్ స్పందించింది.

మన్యంలోనే మరణమృదంగం..

వాస్తవానికి ఈ విద్యాసంవత్సరంలో పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఎనిమిది మందికిపైగా గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. వరుస మరణాలు సంభవిస్తున్నా.. అటు అధికార యంత్రాంగం గానీ, ప్రభుత్వంగానీ నివారణ కోసం తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. మరణం సంభవించినప్పుడు అధికారులు వెళ్లడం.. విచారణ చేపట్టడం .. ఏదో ఒక కారణంతో మృతి చెందినట్లు ప్రకటన ఇవ్వడంతోనే సరిపెట్టేస్తున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితుల కారణంగా వ్యాధులు విజృంభించాయి. సకాలంలో వైద్యం అందక విద్యార్థులు పిట్టల్లా రాలిపోయారు. వందలాది మంది మంచం పట్టారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారంపై సైతం కూటమి ప్రభుత్వం నోరు మెదపలేదు. కనీసం విద్యాలయాల్లో వైద్యతనిఖీలూ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఎన్ఎంల నియామకం చేపడతామన్న హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

ఈ నేపథ్యంలో గత 14న జాతీయ ఎస్టీ కమిషన్‌కు పార్వతీపురానికి చెందిన గిరిజనం సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్‌కుమార్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్.. నెల రోజుల్లోగా వాస్తవ నివేదిక సమర్పించాలని రాష్ట్ర కార్యాలయాన్ని కోరింది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం వాస్తవాలు దాచకుండా నివేదిక అందజేయాలని, మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నట్లు రంజిత్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

గిరిజన గ్రామాల్లో నీతి అయోగ్ బృందం


మనుమకొండ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఆరోగ్యంపై ఆరా తీస్తున్న నీతి ఆయోగ్ బృందం

భామిని: నీతి అయోగ్ బృందం భామిని మండలంలోని మనుమకొండ, పాలవలస, బత్తిలి పీహెచ్‌సీలను శనివారం సందర్శించింది. నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్, యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్ కుమార్‌లు మనుమకొండ అంగన్‌వాడీ కేంద్రం పనితీరును పరిశీలించారు. బత్తిలి పీహెచ్‌సీ, పాలవలస సబ్‌సెంటర్‌లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మనుమకొండలో ఆదివాసీ మహిళల థింసా నృత్యాలు తిలకించారు. వారివెంట మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ సభ్యుడు పత్తిక మురళీ, నీతి అయోగ్ మధుసూధనరావు, కోఆర్డినేటర్ మహేష్, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, బత్తిలి వైద్యాధికారి డాక్టర్ దామోదరరావు, వాస్సన్ ప్రతినిధులు ఉన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- నయంత యూనివర్సిటీ సీఈఓ రంజన్ బెనర్జీ
- సెంచూరియన్‌లో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు
- విద్యార్థులకు డిగ్రీల ప్రదానం



సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థికి డిగ్రీ పట్టాను అందజేస్తున్న అతిథులు


సమావేశంలో మాట్లాడుతున్న నయంత యూనివర్సిటీ సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ

నెల్లిమర్ల రూరల్: అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని నయంత విశ్వ విద్యాలయం సీఈఓ ప్రొఫెసర్ రంజన్ బెనర్జీ పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ 4వ స్నాతకోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కృషి చేసినప్పుడే గొప్ప విజయాలు సొంతమవుతాయన్నారు. ఉన్నత స్థాయికి వెళుతూనే ఇతరులకు చేయూతనివ్వాలన్నారు. ఇతరుల జీవితాల్లో చిరునవ్వులు చూడగలిగినప్పుడే మంచి విజయాలు సాధించినవారమవుతామన్నారు. సెంచూరియన్ వర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్‌రావు విద్యార్థులు సాధించిన విజయాలను ప్రశంసించారు. వర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఏడేళ్ల వ్యవధిలోనే దేశంలో అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఒకటిగా సెంచూరియన్ అవతరించిందన్నారు. వైస్ చాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ వర్సిటీను వ్యాపారం కోసం స్థాపించబడలేదని, శక్తివంతమైన విద్యార్థులను సమాజానికి అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 201 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో ఐదుగురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, 16 మందికి బంగారు పతకాలు, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను వక్తలు అందజేశారు. కార్యక్రమంలో భువనేశ్వర్ వర్సిటీ వీసీ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ పల్లవి, పాలకమండలి సభ్యుడు, పారిశ్రామికవేత్త కుమార్ రాజా, డాక్టర్ పి.ఎస్.ఠాగూర్, ప్రొఫెసర్ కె.సి.బి.రావు, పీఎన్ఎస్‌వీ నరసింహం, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.